# నగరాభివృద్ధి బీఆర్ఎస్ ఘనతే

*మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్*



సనత్‌నగర్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ల ఆశీర్వచనాలు అందుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, నవంబర్ 19 :నగరాభివృద్ధి బీఆర్ఎస్ ఘనతేనని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నగర ప్రజానీకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు బీఆర్ఎస్ సర్కార్ పెద్దపీట వేసిందన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో నగరంలో పెద్ద ఎత్తున ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, మెట్రోరైల్ విస్తరణతో పాటు వరదల నియంత్రణకు సైతం ఎస్ఎన్‌డీపీతో సమగ్రమైన ప్రణాళికలు రచించి నగరానికి కొత్తరూపును తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లదేనన్నారు. ఫలితంగా అనేక బహుళ జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు హార్డ్‌వేర్ కంపెనీలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆస్పత్రులు, విద్యాసంస్థలు, అత్యుత్తమ స్థాయి నిర్మాణ సంస్థలు నగరానికి తరలి వచ్చాయన్నారు. దీంతో యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో నగరాన్ని అన్ని విధాలుగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లదేనన్నారు. కాగా, ఎస్ఆర్‌నగర్ నివాసితుల సంఘం, శాంతిబాగ్ అపార్ట్‌మెంట్స్ నివాసితుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సదస్సుల్లో ఆయన మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ గడిచిన తొమ్మిదన్నరేండ్లలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించామని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చక్కటి సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థలను తీర్చిదిద్దామన్నారు. కాగా, సనత్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో మంత్రి తలసాని పాల్గొన్నారు.



కల్వారీ టెంపుల్‌లో ప్రార్థనలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ –మాదాపూర్

## మైనార్టీలకు పెద్ద పీట

*హోం మంత్రి మహమూద్ అలీ*



మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, నవంబర్ 19 : తెలంగాణ ప్రభుత్వం మైనార్టీలకు పెద్ద పీట వేసిందని హోం మంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. నాచారంలోని స్వాగత్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి హోం మంత్రి మహమూద్ అలీ, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి , మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మసీ ఉల్లాఖాన్, ఉప్పల్ మైనార్టీ అధ్యక్షుడు బద్రోద్దీన్ హాజరయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మైనార్టీలను గౌరవించి అత్యధిక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు హోం మంత్రి చెప్పారు. 9 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మైనార్టీలు సంతోషంగా ఉన్నారన్నారు. షాదీముబారక్, కల్యాణ లక్ష్మి, 400 కే గ్యాస్ సిలిండర్ వంటి అనేక పథకాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచామన్నారు. ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మైనార్టీలు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాసు, శాంతి సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో తెలంగాణ

*కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు*



బాలానగర్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, నవంబర్ 19 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎంగా కేసీఆర్ బాధ్యతలు తీసుకున్నాకే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం బాలానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. అంతకు ముందు ఫిరోజ్‌గూడలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫిరోజ్‌గూడ, గీతానగర్, నవజీవన్‌నగర్, వినాయక్‌నగర్, గణేశ్‌నగర్, సాయినగర్, చెరబండరాజుకాలనీ, రాజుకాలనీ, బాలానగర్ కనకదుర్గ ఆలయం మీదుగా కోమటిబస్తీ, శ్రీశ్రీనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌ల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, స్వరాష్ట్రంలో 60 ఏండ్లలో కాని అభివృద్ధి కేవలం తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు హామీ ఇచ్చారంటే.. నెరవేర్చే వరకు శ్రమిస్తారన్నారు. హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తున్నదన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే బాలానగర్ ట్రాఫిక్ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి.. సమస్య పరిష్కారానికి రూ. 387 కోట్ల నిధులు కేటాయింప జేసి ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో మైనార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే కృష్ణారావు డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ హాజరయ్యారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, మందడి సుధాకర్‌రెడ్డి, పంజా రాంచందర్ ముదిరాజ్, ఎండీ ఖాజా, శంకర్‌గౌడ్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ గౌస్, కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్, ఓల్డ్‌బోయిన్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్ పాల్గన్నారు.

## విపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దు

*ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు*



దుండిగల్, నవంబర్ 19: ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న విపక్ష పార్టీల మాటలను నమ్మిమోసపోద్దని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లల్లో వారు మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలో వేలకోట్ల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

## వారెంటీ లేని గ్యారెంటీలను ప్రజలు నమ్మరు

*అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్*



బీజేపీ నాయకురాలు సుభద్రకు
గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, నవంబర్ 19: సీఎం కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉన్నదని, వారెంటీ లేని పార్టీల గ్యారెంటీలను వారు నమ్మరని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో పలు సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మవెంకటరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బతుకమ్మకుంటకు చెందిన బీజేపీ నాయకురాలు సుభద్ర ఆధ్వర్యంలో 200 మంది మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే బాగ్ అంబర్‌పేట డివిజన్ ఆంధ్రా బ్యాంకు చౌరస్తాలోని వీధి వ్యాపారుంతా (ఫ్రూట్ వెండర్స్) బాబా, యాదుల్లాల ఆధ్వర్యంలో కాలేరు వెంకటేశ్‌కు మద్దతు తెలుపుతూ.. బీఆర్ఎస్‌లో చేరారు. ఎస్టీల ప్రతినిధి రవినాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలువురు ఎస్టీ నాయకులు కూడా గులాబీ కండువా కప్పుకున్నారు. అలాగే పద్మజ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తేజావత్ రమేశ్, కవితారావు, పల్లె భారతిరెడ్డి, రవీందర్‌రావు, ఎర్రబోలు నర్సింహరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మిర్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 'ఆటోనగర్ డంపింగ్ యార్డు'లో పూలవనం

*ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి*



సహారాకాలనీలో ప్రజలకు అభివాదం చేస్తున్న
ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబర్ 19: ఆటోనగర్ డంపింగ్ యార్డు స్థలంలో అందమైన ఫ్లవర్ గార్డెన్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైందని ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారా ఎస్టేట్స్‌కాలనీ, మల్లికార్జునానగర్, ఆగమయ్యనగర్ కాలనీల్లో పర్యటించి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి సహారా ఎస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సహారా ఎస్టేట్స్‌కాలనీలో ఇప్పటికే రూ. 89 లక్షలతో రోడ్లు వేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి వల్లూరిపల్లి పార్థసారథి, కోశాధికారి జగత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటాద్రి, మేకల ప్రభాకర్‌రెడ్డి, రాపోలు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఆపద వస్తే తోబుట్టువులా అండగా ఉంటా

*కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత*



రెండో వార్డు ఇందిరమ్మనగర్‌లో దుకాణదారుడిని ఓటు అభ్యర్థిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్, నవంబర్ 19: 'ఆపద వస్తే తోబుట్టువులా అండగా ఉంటా... ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా' అని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. ఆదివారం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్‌తో కలిసి రెండో వార్డులోని రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే వంద కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో తెలంగాణను సీఎం కేసీఆర్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారని గుర్తు చేశారు. 24 గంటల ఉచిత కరెంటు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు, రైతు బంధు, బీమా లాంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు.